క్లుప్తంగా

నేడు సీతారాముల విగ్రహాల పునఃప్రతిష్ట



ముస్తాబైన సీతారామాలయం

ఎస్.రాయవరం : గుడివాడ శివారు కొత్తపోలవరం గ్రామంలో సీతారామ, లక్ష్మణ ఆంజనేయ, లక్ష్మీగణపతి, శిరిడిసాయి, పాలరాతి విగ్రహ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రతిష్ట కార్యక్రమం చేపట్టనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో శిథిలమైన రామాలయ ప్రదేశంలో రామాలయ పునర్నిర్మాణం చేపట్టి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. గ్రామస్తులు, దాతల విరాళాలతో ఆలయ నిర్మాణం చేపట్టినట్టు వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లపరాజు వెంకటరాజు తెలిపారు. ఈ ఆలయ నిర్మాణానికి రూ.30 లక్షల వరకు ఖర్చు అయ్యిందని తెలిపారు. శాంతి హోమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

25న సామాజిక తనిఖీ ప్రజావేదిక

పాయకరావుపేట : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) పనులకు సంబంధించి ప్రజావేదిక ఈ నెల 25 న నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో ఎ.సాంబశివరావు తెలిపారు. మండలంలో గల 24 గ్రామాల్లో చేపట్టిన పనుల పై గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మేరకు 25వ తేదీన ఉదయం 9 గంటలకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు.

పోషణ్ పక్వాడాతో ఆరోగ్యం



కె.వెంకటాపురంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కోటవురట్ల : కె.వెంకటాపురంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పోషకాహారాన్ని అందజేశారు. పోషణ్ పక్వాడా కార్యక్రమం ద్వారా చిన్నారులకు పోషక విలువలు కలిగిన ఆహారం అందుతుందన్నారు. ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పైల శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

సీతారామ కల్యాణానికి పెళ్లి రాట



పెళ్లిరాట వేస్తున్న మహిళలు

పాయకరావుపేట : మండలంలో గల పాల్తేరు గ్రామంలో సీతారామ కల్యాణానికి పెళ్లి రాట ఏర్పాటు చేయడం జరిగిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 30 వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా సీతారామ కల్యాణం నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామంలో గల ముత్యాలమ్మ గుడి వద్ద జరిగే శ్రీరామనవమికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

నక్కపల్లి: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలంటూ గురువారం ఏపీయుడబ్ల్యుజే పాయకరావుపేట ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నక్కపల్లిలో ర్యాలీ జరిగింది. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని, జర్నలిస్టుల భద్రతా చట్టాన్ని అమలు చేయాలని, ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు కేటాయించాలని, సంక్షేమనిధి, బీమా సదుపాయం కల్పించాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఆర్ఐ శివకు వినతి పత్రం ఇచ్చారు. అంతకుముందు ఏపీ ప్రెస్ అకాడమి మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆచంట రామకృష్ణ, బి.శ్రీనివాస్‌కుమార్, అక్రిడిటేషన్ కమిటీ మాజీ సభ్యుడు కోరాడ చంద్రరావు, ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు రాణా, సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

నిధులిచ్చినా... బాగుపడదేం!

- రహదారులు శిథిలం
- నాణ్యతకు తిలోదకాలిచ్చిన కాంట్రాక్టర్లు



శిథిలమైన రహదారి

కోటవురట్ల : రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుండగా కాంట్రాక్టర్ల వైఖరితో మూణ్నాళ్ల ముచ్చటే అవుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్లు నాణ్యతకు తిలోదకాలు ఇచ్చేశారు. ఇష్టానుసారంగా నిర్మాణం చేయడంతో వేసిన కొద్ది రోజులకే పెచ్చులూడుతోంది. మండలంలోని పలు రహదారులు శిథిలం కావడంతో అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఎన్నో ఏళ్లుగా శిథిల రహదారులతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా నర్సీపట్నం-రేవుపోలవరం రహదారి పూర్తిగా అధ్వానంగా మారడంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యేవారు.

నర్సీపట్నం మండలం పెదబొడ్డేపల్లి నుంచి ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు వరకు ఉన్న 30 కిలోమీటర్ల పరిధి రహదారి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.7.90 కోట్లు మంజూరు చేసింది. ఇది కాకుండా జల్లూరు జంక్షన్ నుంచి రామచంద్రపాలెం వరకు మరో రూ.2 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో సుమారు 6 నెలల క్రితం రహదారి అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో నర్సీపట్నం మండల పెద బొడ్డేపల్లి నుంచి ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు వరకు చేపట్టిన రహదారి నిర్మాణంలో నాణ్యతకు పూర్తిగా నీళ్లు ఒదిలారు. పెద బొడ్డేపల్లి నుంచి రామచంద్రపురం వరకు నిర్మాణం పూర్తి కాగా ప్రస్తుతం చాలా చోట్ల రహదారి శిథిలమవుతోంది. ప్రతి 100 అడుగులకు రెండు మూడు చోట్ల రోడ్డు జరిగిపోయి (స్లైడింగ్) పెచ్చులూడిపోతోంది. ఎన్నో ఏళ్ల తరవాత రోడ్డుకు మోక్షం కలిగిందన్న సంతోషం ఎంతో సేపు నిలవకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం కరుణించినా కాంట్రాక్టరు వైఖరితో రహదారి సమస్య మళ్లీ మొదటికే వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోయిన చోట కాంట్రాక్టరు ప్యాచ్ వర్క్ చేసినా అది కూడా కోరుకుపోతోంది. ఇంకా పలు చోట్ల రోడ్డు మధ్యలో కోరుకుపోయి పెచ్చులూడుతోంది. రోడ్డు నిర్మించి ఆరు నెలలు కూడా కాకముందే శిథిలమవుతుండడంతో అధికారుల తీరుకు మండిపడుతున్నారు. రోడ్డు నిర్మించినా ఉపయోగం లేకుండా పోతోందని, కాంట్రాక్టరుపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నాణ్యతాలోపంపై చర్యలు తీసుకుంటాం

నేను ఇక్కడకు రాకముందే రోడ్డు నిర్మాణం జరిగింది. ఇప్పటికే రోడ్డు నిర్మాణం పరిశీలించడం జరిగింది. నాణ్యత లేక స్లైడింగ్ అవుతోంది. దీనిని గుర్తించాం. చర్యలు తీసుకుంటున్నాం. రహదారి నాణ్యతపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం. రోడ్డు నిర్మించిన రెండేళ్ల పాటు కాంట్రాక్టరే బాధ్యత వహించాల్సి ఉంటుంది. మరమ్మతుకు గురైతే బాగు చేయాల్సి ఉంటుంది.

– కె.ఎస్.ప్రభు, డీఈ, ఆర్‌అండ్‌బీ

శివపార్వతుల కల్యాణానికి రాట మహోత్సవం



కల్యాణానికి పెళ్లిరాట వేస్తున్న దృశ్యం

నక్కపల్లి : ఉపమాకలో ఉన్న ప్రాచీన శివాలయం శ్రీ భువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణానికి సంబంధించి గురువారం పెళ్లిరాట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఏప్రిల్ 1వ తేదీన శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు దేవస్థాన పాలకమండలి, గ్రామస్తులు నిర్ణయించారు. దీనిలో భాగంగా గురువారం ఆలయం వద్ద పెళ్లి రాటవేసే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉపమాక వేంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, శివాలయం అర్చకులు వెలవలపల్లి మహేశ్‌ల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెళ్లి రాట వేశారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు కల్యాణోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, శివాలయం చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, వైఎస్సార్‌సీపీ స్టూడెంట్ విభాగం జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు పాటుపడాలి



భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ భగత్ సింగ్ ఆశయ సాధనకు పాటుపడాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి. శ్రీనివాసరావు అన్నారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో గురువారం భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. భగత్‌సింగ్ విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. 23 ఏళ్ల వయస్సులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించాడని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఎస్ఆర్ ఐటీఐ కరస్పాండెంట్ మళ్ల జోగారావు, సీపీఎం నేత మహేశ్వరరావు, సీఐటీయూ నేత పెంటకోట సత్యనారాయణ, రైతు సంఘ అధ్యక్షుడు మహేష్, సామాజిక కార్యకర్త శేఖర్ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో భగత్‌సింగ్ వర్ధంతి

అచ్యుతాపురం(అనకాపల్లి): మోసయ్యపేట కొత్తూరు వద్ద భగత్ సింగ్ 92వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సోమునాయుడు, మాధవి లక్ష్మణరావు, మహాలక్ష్మినాయుడు తదితరులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అచ్యుతాపురం ప్రశాంతి కళాశాలలో పీడీఎస్‌వో ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి సభ నిర్వహించారు. జన సాహితీ జిల్లా అధ్యక్షుడు శివాజీరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్‌సింగ్ త్యాగం ఎనలేనిదన్నారు. పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భద్రావతి, భావనారుషిల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మునగపాక : తోటాడలో ప్రసిద్ధి చెందిన శ్రీ భావనారుషి దేవాలయంలో భద్రావతి సమేత శ్రీ భావనారుషిల కల్యాణం ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణం జరిపించారు. ఆలయ ధర్మకర్తలు దొడ్డి రాజు, సూర్యనారాయణ, త్రినాథ్, సన్యాసిరావు, సత్యనారాయణ, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి: కొత్తపేటలో గురువారం శ్రీ భద్రావతి సమేత భావనారుషేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పురోహితులు శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగ్గారపు శ్రీనివాసరావు, పద్మశాలి సంఘ నాయకులు పప్పు రాజారావు, సర్పంచ్ అరుణలత, గ్రామ నాయకులు మాడెం రాజుబాబు, తేలు ఈశ్వరరావు, పుచ్చా బాబూరావు, శ్రీరంగ తదితరులు స్వామి, అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం జరిపారు.

గోరుముద్ద అమలుపై ఈవోఆర్‌డీ తనిఖీ



భోజనం పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ చంద్రశేఖర్

పాయకరావుపేట : మంగవరంలోని మండల పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్ గురువారం పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరుపై ఉపాధ్యాయులను, భోజనం తయారు చేసే నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెల్సుకున్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

హరిపాలెం యువకుడికి ఉగాది పురస్కారం



అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం గ్రామానికి చెందిన యల్లపు సతీష్‌కు ఉగాది పురస్కారం లభించింది. ఉగాది రోజున హైదరాబాద్‌లో వేదభారతిలో నేచురల్ ఫుడ్స్‌లో ఆధ్వర్యంలో ఈ అవార్డును అందజేశారు. ఈ మేరకు సతీష్‌కు షీల్డ్, పది వేల రూపాయల నగదు అందజేశారు. సతీష్‌కు పురస్కారం లభించడం పట్ల హరిపాలెం గ్రామస్తులు, శ్రీనివాస రైతు క్లబ్ సభ్యులు అభినందించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



టైల్స్ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని మల్లవరంలో రామాలయంలో టైల్స్ ఏర్పాటు పనులు ప్రారంభించారు. సర్పంచ్ భర్త పిన్నమరాజు గురువారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చందక శివ, రావి నాయుడుపాల్గొన్నారు.

సంపద కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మునగపాక : సంపద తయారీ కేంద్రం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా కో–ఆర్డినేటర్ నాగలక్ష్మి అన్నారు. మండలంలోని తోటాడ సంపద తయారీ కేంద్రాన్ని ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి పొడి చెత్తపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. సంపద తయారీ కేంద్రాల్లో ఎరువుల ఉత్పత్తిపై పాలకులు, అధికారులు దృష్టి సారించాలన్నారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోఆర్డీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఉపమాకలో సప్తాహం



సప్తాహం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నక్కపల్లి: ఉపమాకలో మెరకవీధి రామాలయంలో గురువారం సప్తాహం కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. శ్రీనివాస భక్త సమాజం ఆధ్వర్యంలో శోభాయాత్ర, సప్తాహం కార్యక్రమాలు నిర్వహించారు. వారం రోజుల పాటు నిరంతరం నాన్‌స్టాప్‌గా భజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 5 గంటలకు శోభాయాత్ర చేపట్టారు. ఈ యాత్రకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఏడురోజుల పాటు జరిగే ఈ సప్తాహం కార్యక్రమంలో నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెందిన భజన బృందాలు పాల్గొంటాయని వారు తెలిపారు.

ఆసరాతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక : వైఎస్సార్ ఆసరాతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన డ్వాక్రా సంఘ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మహిళలు ఆర్థికంగా నిలబడేందుకు పలు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆకాల వర్షాలకు దెబ్బతిన్న నువ్వుపంట



గణపర్తిలో దెబ్బతిన్న నువ్వు పంటతో రైతు

మునగపాక : భారీ వర్షాలకు మండలంలోని గణపర్తి, చెల్లమల తదితర ప్రాంతాల్లో 80 ఎకరాలకు పైగా నువ్వు పంట దెబ్బ తిన్నట్టు అధికారులు గుర్తించారు. ఇప్పటికే వేలాది రూపాయలను పెట్టుబడులు చేసిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కాగా దెబ్బతిన్న నువ్వు పంటను స్థానిక వ్యవసాయాధికారులు గురువారం పరిశీలించారు. నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతు మారిశెట్టి రమణ కోరుతున్నారు.

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై నీరు పంట కాలువలను తలపించింది. పొలాల్లో పెసర, మినుము, వరి నూర్పిడి పనుల్లో రైతులు నానా అవస్థలు పడ్డారు. పలు గ్రామాల్లో పెసర, మినుము, ధాన్యం తడిసిపోయాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వేసవికాలంలో వర్షాలు పడుతుండడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారీ వర్షం..రోడ్లు జలమయం



ఉధృతంగా ప్రవహిస్తున్న శేషుగెడ్డ



యలమంచిలిలో ప్రభుత్వాసుపత్రి వద్ద నీటితో నిండిన రహదారులు



మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ఎదురుగా నిలిచిన వర్షపునీరు

యలమంచిలి : యలమంచిలి ప్రాంతంలో గురువారం సాయంత్రం సుమారు 3 గంటల పాటు కురిసిన వర్షానికి యలమంచిలి పట్టణంతో పాటు పరిసర గ్రామాలు తడిసిముద్దయ్యాయి. గురువారం కురిసిన వర్షానికి పట్టణ ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. యలమంచిలి రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. ప్రజలు ఇళ్లకే పరిమితం కావడంతో రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. మండలంలోని వాగులు, వంకలు, గెడ్డల్లో వర్షపు నీరు పొంగి ప్రవహించింది. గ్రామీణ ప్రాంతాల్లో కచ్చా రోడ్లు బురదమయం కావడంతో వాటి మీదుగా రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడ్డారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో కొన్ని చోట్ల అంధకారం అలముకుంది. మెట్ట ప్రాంతంలో పంటలు జలమయియ్యాయి. యలమంచిలి నుంచి అనకాపల్లి వెళ్లే పాత జాతీయ రహదారిలో శేషుగెడ్డ ఉధృతంగా ప్రవహించింది. దగ్గరలో ఉన్న రూరల్ పోలీసు సిబ్బంది అటుగా వెళ్లే ప్రయాణికులను గెడ్డ దాటించడానికి సహాయక చర్యలు చేపట్టారు. 4సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

పంట పొలాల్లో చేరిన నీరు..

కోటవురట్ల : మండలంలో గురువారం కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండ మండిపోగా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకుని కుండపోత వర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది.

కాలనీలో నిలిచిన వర్షపునీరు

మునగపాక : మండల వ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. మునగపాక బీసీ కాలనీ, ఇందిరమ్మ కాలనీలో పలు చోట్ల నీరు నిలిచిపోయింది. కాగా నువ్వు పంటకు ఈ వర్షం నష్టం చేకూర్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మునగపాక హైస్కూల్‌కు ఎదురుగా మెయిన్‌రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో జనం అవస్థలు పడ్డారు.

సంపద తయారీ కేంద్రంలో శిక్షణ

మునగపాక : మునగపాకలోని సంపద తయారీ కేంద్రంలో శుక్రవారం నుంచి 5 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని సర్పంచ్ దిమ్మల అప్పారావు తెలిపారు. అచ్యుతాపురం మండలంలోని 29 పంచాయతీలకు సంబంధించి 5 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

యోగా ద్వారా చదువుపై ఏకాగ్రత



విద్యార్థులకు యోగ సాధనపై శిక్షణ ఇస్తున్న ట్రైనర్ శంకర్

యలమంచిలి : యోగ సాధన ద్వారా విద్యార్థుల్లో చదువు పట్ల ఏకాగ్రత పెరుగుతుందని రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి టి.రామకృష్ణ అన్నారు. గురువారం అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పేటబయ్యవరం పాఠశాలలో విద్యార్థులకు యోగ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ యోగ విద్యార్థుల్లో మానసిక ఆత్మస్థయిర్యం, ఆరోగ్యం పెరుగుతుందని అన్నారు. విద్యార్థులకు 12 సూర్యనమస్కారాలు వాటి మంత్రాలు, యోగాభ్యసనాలు, గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాపాజీరావు, ఉపాధ్యాయులు బొడ్డేడ సత్యనారాయణ, కాసులు, పీల రవీంద్ర ప్రవీణ్, పాపారావు, కృష్ణవేణి పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో తల్లులకు ఎంతో మేలు



మాట్లాడుతున్న సీడీపీవో ఇందిరాదేవి

యలమంచిలి : చిరు ధాన్యాల వాడకం ద్వారా గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను నివారించవచ్చునని సీడీపీవో కె.ఇందిరాదేవి అన్నారు. గురువారం మండలంలో లైను కొత్తూరు కాలనీ, పోతిరెడ్డిపాలెం, రేగుపాలెం, గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలతో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల ద్వారా కలిగే నష్టాలను గుర్చి మహిళలకు వివరించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీడీవో ప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో బాలింతలకు, గర్భిణులకు చిరుధాన్యాలతో కూడిన పోషకాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్నారని తెలిపారు. బాలింతలలో రక్తహీనతను నివారించడానికి ప్రతి ఒక్కరూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని, ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారుల బృందం సభ్యులు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో నాణ్యమైన ఆహారం అందించాలి



ఐసీడీఎస్ కార్యాలయంలో పోషకాహార వస్తువులు పరిశీలిస్తున్న ఎంపీపీ తదితరులు



మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

నక్కపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. గురువారం నక్కపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పోషకాహార పక్షోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అందుబాటులో ఉన్న పదార్థాలు, వనరులతో తక్కువ ఖర్చుతో తయారు చేసే నాణ్యమైన పోషకాహార వస్తువులను తయారు చేసి ఇక్కడ ప్రదర్శించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల మాదిరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు జగనన్న సర్కారు మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని సరఫరా చేస్తోందన్నారు. స్థానికంగా లభించే పోషక విలువలతో కూడిన పదార్థాలను ఉపయోగించి వంటకాలు తయారు చేసి పిల్లలకు పెడితే వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. పండ్లు, కాయగూరలు, విటమిన్లు, ఐరన్ ఎక్కువగా లభించే పదార్థాలను తినడం వల్ల కలిగే ఉపయోగాలను పిల్లలకు, వారి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ఇక్కడ ప్రదర్శించిన వస్తువులను అంగన్‌వాడీ కేంద్రాల్లో తయారు చేయించి పిల్లలకు పెడితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. బరువు తగ్గిపోవడం, రక్త హీనత వంటి సమస్యల నుంచి కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, సర్పంచ్‌లు సురేష్ వర్మ, సాదిరెడ్డి శ్రీను, ఉపసర్పంచ్ వీసం రాజు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

కోటవురట్ల : గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. యండపల్లి గ్రామ సచివాలయంలో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పీవీ రాఘవ పోషణ్ పక్వాడా కార్యక్రమం ద్వారా పాటించాల్సిన అంశాలను వివరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మాతా శిశు మరణాలను అరికట్టేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పావని, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.